క్లుప్తంగా

సద్గురు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ కూడలి వద్ద సద్గురు సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చని పందిరితో అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గైడపాటి విక్టర్, తదితర నాయకులు.. స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం స్వామికి పల్లకి సేవ, సంధాకచ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పురోహితుడికి రూ.1.16 లక్షల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6కు చెందిన పురోహితుడు మంగిపూడి రవికుమార్‌శర్మకు శర్మదాయని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రూ.1,16,116 ఆర్థిక సాయం చేశారు. శర్మకు షుగర్ కారణంగా ఇటీవల ఆయన రెండు కాళ్లను వైద్యులు తొలగించారు. ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలు. దీంతో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ సంస్థ సభ్యులు సాయమందించారు. ఆదివారం సంస్థ ప్రతినిధులు అతని నివాసానికి వెళ్లి ఆ మొత్తాన్ని అందజేశారు.

వేడుకగా యల్లమ్మ జాతర

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలో యల్లమాంబ నగర్ కాలనీలో యల్లమ్మతల్లి జాతర ఆదివారం వేడుకగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించుకుని మొక్కులు చెల్లించకున్నారు. ఆలయంలో అర్చకుడు సంతోష్‌శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కోలాట నృత్యాలు, సాము గరడీల నడుమ సారే ఊరేగింపు సందడిగా సాగింది. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎన్నికల తర్వాత డీఎస్సీ నిర్వహించాలి

బీచ్ రోడ్డు : డీఎస్సీ పరీక్షలను ఎన్నికల తర్వాత నిర్వహించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు సన్నద్ధమయ్యేందుకు సమయం దొరుకుతుందని పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు. ఎన్నికల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని, తగదాలు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు పోలీస్ సిబ్బంది సూచించారు. ఎన్నికల వేళ జాగ్రత్తగా ఉండాలని, హద్దు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధోకా లేదు..

తాగునీరు పుష్కలం

- జోన్-2లో అందుబాటులో 8797 కుళాయిలు, 548 బోర్లు
- ముడసర్లోవలో 164.3 అడుగుల మేర నీరు నిల్వ
- వేసవి నీటి ఎద్దడి నివారణకు సన్నాహాలు



10వ వార్డులో చేతి బోరు



నీటితో కళకళలాడుతున్న ముడసర్లోవ రిజర్వాయరు



12వ వార్డులో కుళాయి ద్వారా నీటి సరఫరా

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. జీవీఎంసీ జోన్-2 పరిధిలో పక్కాగా తాగునీటి సరఫరాకు అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. నియోజకవర్గంలో జోన్-2 పరిధిలో 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు ఉన్నాయి. వాటిలో ఆరిలోవ ప్రాంతం 11, 12, 13 వార్డుల్లో వేల సంఖ్యలో కుళాయిలు, వందల సంఖ్యలో చేతి బోర్లు ఉన్నాయి. దీంతో ఆయా వార్డుల్లో నీటి సమస్యకు బ్రేక్ పడింది. ఈ ప్రాంతానికి ముడసర్లోవ రిజర్వాయర్ వరంలా నిలిచింది. ఇందులో పుష్కలంగా నీరు ఉన్నంత వరకు ఈ ప్రాంతానికి తాగునీరు, వాడుకనీటి కోసం ఎలాంటి సమస్యా తలెత్తదు. ఈ రిజర్వాయరు అడుగంటినప్పుడు మాత్రం ఆరిలోవకు నీటి సరఫరా చేయడానికి జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు ప్రత్యామ్నాయం వెతుకుతుంటారు. ఈ రిజర్వాయరు 2019 మే నెలలో పూర్తిగా ఎండిపోయి బీటలు వారింది. అప్పట్లో ఆరిలోవ ప్రాంతంలో ప్రజలు నీటి కోసం నానా ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత సంవత్సరం నుంచి వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయరులో పుష్కలంగా నీరు నిల్వ ఉంటోంది. ప్రస్తుతం ముడసర్లోవ రిజర్వాయరులో 164.3 అడుగుల నీరు నిల్వ ఉన్నట్టు నీటి సరఫరా అధికారులు తెలిపారు. రిజర్వాయరులో నీటితో పాటు టీఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి తాగునీటి ఆరిలోవ ప్రాంతానికి అధికారులు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆయా వార్డుల్లో గాంధీనగర్, తోటగరువు, బాలాజీనగర్, టీఐసీ పాయింట్, దుర్గాబజార్, ఆరిలోవ కాలనీ, విశాఖ కేంద్ర కారాగారం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ వరకు, కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు నీటి సరఫరా జరుగుతుంది. నిరంతర ప్రక్రియలో భాగంగా కొత్త కుళాయిలు ఇవ్వడం, అవసరమైన చోట కొత్తగా బోర్లు తీయడం చేస్తున్నారు. ఇప్పటికే వేల సంఖ్యలో కుళాయిలు, వందల సంఖ్యలో బోర్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఆయా వార్డుల్లో పుష్కలంగా నీటి సరఫరా జరుగుతుంది.

8797 కుళాయిలు, 548 బోర్లు

జీవీఎంసీ 11, 12, 13 వార్డుల్లో 8,797 కుళాయిలు, 548 చేతి బోర్లు ఉన్నాయి. వాటిలో సుమారు రెండేళ్లలో కొత్తగా సుమారు 800 వరకు కొత్త కుళాయి కనెక్షన్లు, 30 చేతి బోర్లు ఆయా వార్డుల్లో అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజలకు నీటి సమస్యల ఉన్న దగ్గర, అవసరమైన చోట్ల వాటిని ఏర్పాటు చేశారు. వీటన్నింటితో పాటు రెండు ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంకర్ల ద్వారా కొండవాలు ప్రాంతాలతో పాటు ఆరిలోవలో పలుచోట్ల, పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్ తదితర ప్రాంతాలకు నిరంతరం నీటి సరఫరా చేస్తున్నారు. 11వ వార్డులో 2,861 కుళాయిలు, 192 బోర్లు, 12వ వార్డులో 2,859 కుళాయిలు, 202 బోర్లు, 13వ వార్డులో 3,077 కుళాయిలు, 154 బోర్లు ఉన్నాయి.

అందుబాటులో చేతి బోర్లు



కాలనీల్లో చేతి బోర్లు అందుబాటులో ఉన్నాయి. కుళాయిల ద్వారా వడకట్టిన నీరు వస్తుంది. గతంలో కంటే ఇప్పుడు నీటి సమస్య తీరింది. ప్రస్తుతం తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదు. కొన్నిసార్లు కుళాయి నీరు రావడం ఆలస్యమైతే వాటికి బదులుగా దగ్గరలో ఉన్న చేతి బోరింగులు వద్ద నీరు పట్టుకుంటున్నాం.

– రెడ్డి సత్యవతి, ఆరిలోవ కాలనీ

ఠంచన్‌గా కుళాయిల ద్వారా నీటి సరఫరా

ప్రతి రోజూ కుళాయిలు ద్వారా సమయానికి నీటి సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా కూడా నీరు సరఫరా చేస్తున్నారు. రోజూ సరిపడినంత నీరు వస్తుంది. బ్లీచింగ్ కలిపి, శుభ్రం చేసిన నీటి సరఫరా చేస్తున్నారు. గతంలో నీటి కోసం బాగా ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం నీటి కోసం పెద్దగా సమస్య లేదు.

– పార్వతి, గృహిణి, పెదగదిలి

నేటి నుంచి స్పెషల్ యోగా థెరపీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రత్యేక యోగా థెరపీ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా భారత్ నివేష్ మారథాన్



బీచ్ రోడ్డులో మారథాన్ ప్రారంభిస్తున్న సెబీ, ఏఎంఎఫ్ఐ అధికారులు

ఆరిలోవ: అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇండియా(ఏఎంఎఫ్ఐ), సెక్యూరిటీ అండ్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ) సంయుక్తంగా ఆదివారం బీచ్‌రోడ్డులో భారత్ నివేష్ మారథాన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మారథాన్‌ను ఆర్కే బీచ్ వద్ద సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.రామ్‌మోహన్ రావు, ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట చలసాని, నేవల్ ఈస్టర్న్ కమాండ్ రీపిట్ ఆఫీసర్ ఎస్.సబేశన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధికారులు మాట్లాడుతూ సమాజంలో విద్య, ఆరోగ్యానికి పెరుగుతున్న ప్రాధాన్యత గురించి వివరించారు. సామాజిక శ్రేయస్సును పెంపొందించడంలో పెట్టుబడిదారులు ముందుండాలన్నారు. విశాఖపట్నం ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మారథాన్‌లో అధిక సంఖ్యలో యువత, ఆయా సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



19వ వార్డులో ఎంపీ ఎంవీవీ సమక్షంలో పార్టీలో చేరిన యువకులు



22వ వార్డు తెలుగు యువతతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీ, పీతల గోవింద్

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట వాల్తేర్ డిపో జలసాగర్ ఆటో స్టాండ్ డ్రైవర్లు 100 మంది ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులు కావడంతో పాటు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపీ ఎంవీవీ సమర్థ నాయకత్వంపై ప్రభావితమై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ కొన్నేళ్లుగా టీడీపీ మద్దతుదారులుగా ఉన్న ఆటో డ్రైవర్లు అంతా వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. భవిష్యత్‌లో పేదలకు మరింత సేవ చేసేందుకు అవకాశం ఇస్తూ వైఎస్సార్‌సీపీని మరోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు/మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీ చెందిన చెందిన సుమారు 100 మంది టీడీపీ కార్యకర్తలు ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా యువకులకు ఎంపీ ఎంవీవీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ యువత భవితకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిష్పాక్షపాతంగా అమలు చేయడమే యువతను ప్రభావితం చేస్తున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో ఉమర్, శ్రీకాంత్, ఎల్లాజీ, జగదీష్, శ్రీను, గణేష్, అధిక సంఖ్యలో యువకులు ఉన్నారు.

శాంతినగర్‌లో ఎంవీవీ సహపంక్తి భోజనం



10వ వార్డు శాంతినగర్‌లో కార్యకర్తలతో కలిసి భోజనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు శాంతినగర్‌లో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం పర్యటించారు. ఆయన గడపగడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయో? లేదో? అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల గురించి ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం శాంతినగర్‌లో గిరిజాల రమణ, శ్యామల ఇంటిలో ఆయన వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దొంగలున్నారు జాగ్రత్త

ఆరిలోవ: కాలనీల్లో దొంగలు తిరుగుతున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని క్రైం డీసీపీ వెంకటరత్నం హెచ్చరించారు. జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ఆదివారం సాయంత్రం ద్వారకా క్రైం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టపగలే కొందరు అపరిచిత మహిళలు ఏదో అవసరం కోసం వచ్చి ఇళ్లలో చొరబడుతున్నారని తెలిపారు. కారులో భార్యభర్తలుగా చెప్పుకుంటూ వస్తున్నారని, వారిలో మహిళలు మాత్రం వీధులు, అపార్ట్‌మెంట్లలో ఇళ్లకు వెళ్లి అనాథ శరణాలయం నుంచి వచ్చామని, సహాయం చేయాలని అడుగుతున్నారన్నారు. ఇలా తాళాలు వేసి ఉండే ఇళ్లు పరిశీలించడం, ఒంటరిగా ఉన్న మహిళల మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేయడం చేస్తున్నారని చెప్పారు. ఇటీవల సాగర్‌నగర్, డెయిరీ ఫారం వద్ద వెటర్నరీ కాలనీలో ఇలాంటి దొంగతనాలు జరిగినట్లు వివరించారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించి వాకింగ్‌కు వెళ్లవద్దన్నారు. ఊరు వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని, పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. కాలనీల్లో సంఘాల నాయకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనచోదకులు తమ వాహనాలకు హ్యాండిల్ లాక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. అపరిచితులు కనిపించినా, అనుమానాస్పదంగా తిరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకా జోన్ ఏసీపీ వెంకటరావు, సీఐ శ్రీనివాసరావు, ఆరిలోవ క్రైం ఎస్ఐ మురళీకృష్ణ, రామకృష్ణాపురం గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, స్థానికులు కాకర గోవింద్, మహిళలు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 427 మంది తోటగరువు విద్యార్థులు



తోటగరువు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఈ ఏడాది(2023-24) 427 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. గతంలో కంటే ఈ పాఠశాల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ ఏడాదే ఎక్కువ కావడం విశేషం. 2022-23 విద్యా సంవత్సరంలో 357 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 2021-22లో ఇక్కడ 359 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న 427 మందిలో 245 మంది బాలురు కాగా.. 182 మంది బాలికలు ఉన్నారు. వీరిలో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 253 మంది కాగా, తెలుగు మీడియం విద్యార్థులు 174 మంది ఉన్నారు. పరీక్షల కోసం విద్యార్థులను ప్రణాళికబద్ధంగా చదివించి సిద్ధం చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం దుర్గాభవాని తెలిపారు.

ఆరిలోవ ప్రాంతంలో 8 పరీక్ష కేంద్రాలు

ఈ ఏడాది జరుగుతున్న పదో తరగతి పరీక్షల కోసం ఆరిలోవ ప్రాంతంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చినగదిలి మండలం తహసీల్దార్ రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు, శ్రీకృష్ణాపురం గురుకులంలో ఒక కేంద్రంతో పాటు మరో ఐదు స్థానిక ప్రైవేట్ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాలలో సుమారు 1,800 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో 13 మంది సిబ్బంది పరీక్షల విధులు నిర్వహించడానికి నియమించామన్నారు. అన్ని కేంద్రాలలోనూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలతో పాటు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



పిచ్చుకల కోసం ధాన్యం కంకులతో క్యూరేటర్ నందనీ సలారియా, హరిత వికాస్ సభ్యులు



చెట్టుకు ధాన్యం కంకులు కడుతున్న బాలిక

ఆరిలోవ: ప్రకృతిలో పిచ్చుకలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం హరిత వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూ సందర్శకులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. అనంతరం జూలో పలు చోట్ల చెట్లకు పిచ్చుకల ఆహారం కోసం ధాన్యం కంకులు కట్టారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో పరిస్థితులు వల్ల పిచ్చుకలు జాతి అంతరించిపోతుందన్నారు. అక్కడక్కడా కనిపించే వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రకృతిలో అన్ని జాతుల జీవులను రక్షించుకుని జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్ పాలవలస గోపాలనాయుడు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది, హరిత వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో బొత్స దంపతులు



సింహగిరిపై బొత్స ఝాన్సీలక్ష్మి, సత్యనారాయణ దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఆమె భర్త, మంత్రి బొత్స సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అభినందనలు



ప్రిన్సిపాల్ మంజులను అభినందిస్తున్న అధ్యాపకులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్. మంజులను పలువురు అధ్యాపకులు అభినందించారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు మంచి బోధన అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా కొనసాగిన డాక్టర్ ఎస్. శోభారాణి రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆమె స్థానంలో భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన మంజులను ఇక్కడ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.